సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ యుగంధర్‌రెడ్డి

వనపర్తిటౌన్: ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ రాందాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటైన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌లో అనవసరమైన లింక్‌లు, అపరిచిత నంబర్లతో ఇచ్చిన మెసేజ్‌లు ఓపెన్ చేయడం, బ్యాంక్ వివరాలు, ఓటీపీ ఇతరులకు చెప్పొద్దన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు దేగల కృష్ణయ్య మాట్లాడుతూ.. మహిళలు, బాలికల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవడం విద్యార్థుల బాధ్యత అని చెప్పారు. జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోకి ఉమెన్ హబ్‌ను ప్రవేశపెట్టడం మహిళా సమస్యల సాధికారతకు నిదర్శనంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు భాస్కర్, శ్రీవాణి, సలోమి, కళాశాల ప్రిన్సిపాల్ హవీలా రాణి, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు ..

కొత్తకోట రూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. సోమవారం సాయంత్రం పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా, ముగ్గురు హెల్మెంట్ లేకుండా వెళ్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెబ్బేరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ చాలీచాలనీ వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సేవ చేస్తున్న కార్మికులపై నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, రాములు, ఆర్యన్ రమేష్, హనుమంతునాయక్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: ఐకేపీలో పనిచేస్తున్న గ్రామ సంఘాల సహాయకులు (వీఓఏ) తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పాన్‌గల్‌కు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ గ్రామ సంఘాల గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు అందించాలని, ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్‌ట్యాప్, నెట్ సౌకర్యం కల్పించాలని, జీఓ నంబర్ 58ను సవరణ, కనీస వేతనం రూ.26 వేలు అందించడంతో పాటు 3 నెలల రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి జూపల్లికి సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సాగునీటి కాల్వల మరమ్మతు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు సాఫీగా చేరేలా చూడాలని, మండల కేంద్రంలోని పీహెచ్‌సీ స్థాయిని పెంచి 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల సమస్యలు వంటి వాటిని పరిష్కారించాలని కోరినట్లు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాము, నిరంజన్, బాబునాయక్, జమ్ములయ్య, సోముల తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

అమరచింత: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని నందిమళ్లలో మండల పీడీఎస్‌యూ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై నేటికీ రెండు నెలల కాలం దాటుతున్నా సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలపై పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో భానుప్రకాష్, నరేందర్, అనిల్, మోహన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహాల వద్ద జాగ్రత్తగా ఉండాలి



జూరాల ప్రాజెక్టు వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

అమరచింత: నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద ప్రజలు, యువకులు అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే ప్రాణాపాయం తప్పదని ఏఎస్ఐ బాలకిష్టయ్య అన్నారు. ప్రియదర్శిని జూరాల ఎడమ కాల్వ సమీపంలో సోమవారం సందర్శకులతో పాటు స్థానిక చేప వంటకాల తయారీదారులకు ప్రవహించే నీటి వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరుతుండడంతో ఎడమ కాల్వతో పాటు సమాంతర కాల్వ ద్వారా నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారన్నారు. కాల్వ సమీప గ్రామాలైన నందిమళ్ల, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు నదీ పరిసరాల ప్రాంతాల్లోకి వెళ్లరాదన్నారు. ముసురు వర్షాల కారణంగా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవడం ద్వారా విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. మట్టి ఇళ్లలో నివసించొద్దని సూచించారు. ఎలాంటి ఘటనలు ఎదురైనా వెంటనే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటకు చెందిన శేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతడితో కలిసి 1995–96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.30 వేలు జమచేసి నగదును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అంజి, మహేష్, సాయిలుయాదవ్, కురుమూర్తి, ఖాజా, శివశంకర్, ఆంజనేయరెడ్డి, ఆయూబ్‌పాష, రాజు, రవీందర్, షానవాజ్, రషీద్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న మున్నూరు రవీందర్

వనపర్తిటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మున్నూరు రవీందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు జిల్లాల నుంచి గ్రామాల వరకు అర్హుల గడపగడపకు చేరవేసేందుకు క్రియాశీలకంగా పనిచేసినందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు ప్రజలు పెద్ద ఎత్తున ఓటు వేశారని గుర్తుచేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏదీ అమలు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన బూత్ కమిటీ అధ్యక్షులను, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను, మండల నాయకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, రామన్నగారి వెంకటేశ్వరరెడ్డి, బాలరాజు, సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



అమరచింత: పట్టణంలో నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు సోమవారం నాలుగు మట్టి ఇళ్లు కూలిపోయాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. మహంకాళి లచ్చన్న, ఈడ్గి గోపాల్, బాయికాడి రామేశ్వరమ్మ, మీనుగ హన్మంతుకు చెందిన ఇళ్లు కూలిపోయాయన్నారు. బాధితులు బంధువుల ఇళ్లకు వెళ్లమని సలహ ఇచ్చామని, లేనిపక్షంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతి గృహంలో ఉండమని చెప్పినట్లు ఆయన వెల్లడించారు. సహాయక చర్యల్లో తమ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం..

పెబ్బేరు రూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు వనపర్తి మండలంలోని రాజనగరం గ్రామానికి చెందిన నక్క కృష్ణయ్య ఇల్లు ఆదివారం తెల్లవారుజామున అకస్మాతుగా కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం కలగలేదు. స్థానికుల సమాచారం మేరకు సోమవారం ఆర్ఐ మధుసూదన్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని నక్క కృష్ణయ్య అధికారులను వేడుకున్నారు.

బాలికల రక్షణకు కలిసి పనిచేద్దాం

పెబ్బేరు రూరల్: షీ టీమ్స్‌తో బాలికలకు సంరక్షణకు దోహదపడుతాయని ఎస్ఐ అంజద్ అన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బాలికలకు అవగాహన కల్పించారు. అమ్మాయిలు చిన్న చిన్న ఘటనలకు ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని, వారి రక్షణకే షీ టీమ్స్ ఎప్పుడు తోడుగా ఉంటుదని తెలిపారు. అల్లరి మూకల చిల్లర చేష్టలను గమనించేందుకు షీటీం నిఘానేత్రంగా పనిచేస్తుందని చెప్పారు. మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే సైబరు నేరగాలపై నిఘా ఉంచి బాధ్యతులపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు వెంటనే 63039 23211కి కాల్ కానీ, వాట్సప్ ద్వారా సందేశం పంపిస్తే వెంటనే షీ టీమ్స్ బృందం చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించాలి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం మద్యం, బెల్టు షాపులను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో సోమవారం ఐద్వా మండల మూడో మహాసభలను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిలీల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారితపై అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి మహిళకు నెలకు రూ.2,500 నగదును చెల్లించాలని కోరారు. సామాజిక పింఛన్లను రెట్టింపు చేయాలని కోరారు. సినిమాల్లో, సీరియల్లో మహిళలను ఆట వస్తువుగా చూపించే సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని రేమద్దులలో మహిళా పొదుపులో జరిగిన అవినీతిని వెలికి తీసి రూ.7 లక్షలు రికవరీ చేయించిన ఘనత ఐద్వాకే దక్కిందన్నారు. జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయిన గర్భిణి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపలేదన్నారు. ఆగస్టు 4న జరిగే జిల్లా ఐద్వా మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా పట్టణ అధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా వసంత, ఉపాధ్యక్షులుగా మెర్లిన్, డీసీ వసంత, సహాయ కార్యదర్శులుగా మంజుల, కమల కమిటీ సభ్యులుగా స్వర్ణ, శాంత, ఏమేలాదేవి, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి కవిత్వాలు మరువలేనివి

వనపర్తిటౌన్: దాశరథి రచించిన కవిత్వాలు, రాసిన గేయాలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ ప్రకాశ్ పేర్కొన్నారు. దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి గిరిరాజాచారి, బాలస్వామి, బాలేమియా, నరసింహ, రాధాకృష్ణ, వెంకటేష్, రంగస్వామి, వెంకటస్వామి, కురుమూర్తి, విష్ణు, భాస్కర్, కృపాకర్ రెడ్డి, సుధాకర్ శెట్టి, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

చెలిమిల్లలో విద్యార్థి అదృశ్యం

పెబ్బేరు రూరల్: పట్టణంలోని చెలిమిల్లకు చెందిన కొండపల్లి జితేంద్ర ఈ నెల 15 తేదీ నుంచి కనబడటం లేదని తండ్రి కొండపల్లి రామచంద్రయ్య పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చెలిమిల్లకు చెందిన కొండపల్లి రామచంద్రయ్య రెండో కుమారుడు కొండపల్లి జితేంద్ర వనపర్తిలోని రేడియంట్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. జితేంద్ర ఈ నెల 10న హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. అనంతరం ఈనెల 15న సాయంత్రం పాఠశాలకు వెళ్లేందుకు తండ్రి బైక్‌పై పెబ్బేరు బస్టాండ్‌లో వదిలారు. 20న పాఠశాల వార్డెన్ విద్యార్థికి తండ్రికి ఫోన్ చేసి మీ అబ్బాయి పాఠశాలకు రాలేదని సమాచారం తెలిపారు. దీంతో వారు బంధువులు, స్నేహితుల ఇళ్లో వెతికినా.. ఎక్కడా లేకపోవడంతో సోమవారం కొండపల్లి రామచంద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు హామీలను అమలు చేయడంలో విఫమైందని బీజేపీ మండల యువజన నాయకుడు రాజమౌళి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాజమౌళి కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు చేస్తామని అబద్ధపు హామీలతో గడెనెక్కి, ఇప్పడు చేతులెత్తేసిందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని నేటికీ అమలుకు కార్యచరణ చేపట్టలేదన్నారు. గ్రామాల్లో నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రతిపాదనలను పంపాలని డిమాండ్ చేశారు. వితంతువులకు పెన్షన్లను పెంచుతామని హామీ ఇచ్చి ఆ ఊసే ఎత్తకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.

'కౌలు రైతులు, కూలీలకు రైతుభరోసా ఇవ్వాలి'

మదనాపురం: ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసా పథకం అమలు చేస్తామని ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యుగంధర్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ ఎలాంటి వ్యవసాయ భూములు లేని నిరుపేద కుటుంబాలకు, పట్టణాల్లో ఉంటూ రోడ్లకు ఈరువైపులా చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం కొనసాగించే వారికి ప్రభుత్వం 'ప్రత్యేక భరోసా' పథకం ప్రవేశపెట్టి వారిని ఆదుకోవాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై తమ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్త సూగూరు ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన దయానంద్, సుమతి ఇటీవల బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు, పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు సమీ, స్వాతిని సోమవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ జూడం వెంకటటేష్‌తో కలిసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, దుర్గాప్రసాద్, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, నాగరాజు, శన్ముఖ శ్రీనివాస్, మహేష్‌కుమార్, అంగన్‌వాడీ టీచరు మంజుల, స్వరూపరాణి, గ్రామస్తులు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్, జీహెచ్ఎం కొండాపురం బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 2020 ఎన్‌పీఈ అమలై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీఎల్ఎం మేళాలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్షా సప్తా కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఏడురోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు.

ఖబ్రస్తాన్ పరిశీలన



ఆత్మకూర్: పట్టణంలోని సర్వే నంబర్ 1, 2, 517లోని 2.20 ఎకరాల్లో ముస్లింల ఖబ్రస్తాన్ (శ్మశానవాటిక)లో సమాధుల ధ్వంసం అయిన ఘటనలో తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్ బృందం ఆధ్వర్యంలో సందర్శించారు. సోమవారం ఖబ్రస్తాన్ స్థలాన్ని సర్వే అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. వారం రోజుల్లోగా ఖబ్రస్తాన్‌లోని ముల్లపొదలను తొలగించి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి కంపౌండ్‌వాల్‌ను నిర్మిస్తామని అధికారులు హామీనిచ్చారు. కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పెబ్బేరు రూరల్: ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులను మంజూరు చేసి సంపూర్ణ హక్కులు కల్పించాలని మండల ముదిరాజ్‌ల సంఘం అధ్యక్షుడు గోనెల బాలస్వామి డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి చేర్చాలని సోమవారం మండలంలోని ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని ముదిరాజ్ భవనం నుంచి నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లయ్య, నాగేంద్రం, గోపాల్, సమదేవుడు, కర్రెన్న, కురుమూర్తి, భరత్‌కుమార్, ఆనంద్,రాజు, నాగన్న, సాయన్న, బక్కన్న, అంజి ఉన్నారు.

తాగునీటి కొళాయిల వద్ద పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది



కొళాయి ప్రదేశాన్ని పరిశీలించిన ఎంఈఓ భాస్కర్‌సింగ్

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిల వద్ద మురుగు, చెత్తచెదారంతో అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో విద్యార్థులు తాగునీటి కోసం అటు రావడమే మరిచారు. విషయాన్ని 'సాక్షి' దినపత్రిక ఈనెల 20న పాఠశాలలో పరిసరాలు అపరిశుభ్రం అనే శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన జిల్లా అధికారులు ఎంఈఓ భాస్కర్‌సింగ్, పాఠశాల జీహెచ్ఎం కృష్ణవేణమ్మ వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారుల ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తమ సిబ్బందిలో కొళాయి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. విద్యార్థుల సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించడంలో చొరవ చూపిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేత



బాధితుడి భార్య అనితకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సాయిబాబా, మహేష్ కలిసి ఈనెల 5న వనపర్తికి బైక్‌పై వెళ్తుండగా.. నాగవరం సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ఏటీఎం బొలోరో వాహనాన్ని ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుమ్మరి సాయిబాబాకు తీవ్ర గాయాలు కాగా వనపర్తి ఆస్పత్రికి తరలించగా పరీక్షించి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. 18రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిబాబా కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం సహాయనిధి నుంచి రూ.2.50లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఆ ఎల్ఓసీ కాపీని సోమవారం బాధితుడి భార్యకు అందజేశారు. ఎల్ఓసీ రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, గ్రామ కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, నరేష్, రాంచంద్రయ్య, మండ్ల రవి, నిరంజన్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: సీజనల్‌గా వచ్చే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్‌లో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలంటూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం పెద్దమందడి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు జనలీల రవి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల ప్రచారంలో బీసీ డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలోని బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీ కమిషన్ ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 42శాతం కల్పిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు ఎండీ అమీరుద్దీన్, రాము ఉన్నారు.

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేసిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న అన్నారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా పిలుపు మేరకు సోమవారం మండల ఓబీసీ నాయకులు బీసీ డిక్లరేషన్ పూర్తిచేయాలని కోరుతూ తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో విక్రం, శివకుమార్, గోపి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో చేసిన ప్రకటనకు బీసీ డిక్లరేషన్ చేయాలని బీజేపీ ఓబీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు కేంద్రాల్లో సోమవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, వినోద్‌సాగర్, దేవేందర్, రాములు, నారాయణ, కిరణ్‌కుమార్ వెంకటస్వామి, జానీ, లక్ష్మీనారాయణ, మోహన్‌రాజు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

అర్చకుల అభ్యున్నతికి కృషి

పాన్‌గల్: తెలంగాణ రాష్ట్ర ధూప, దీప, నైవేద్యం కార్యవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా మండలంలోని కేతేపల్లికి చెందిన పల్లా విజయ్ కుమార్‌శర్మను నియమించారు. సోమవారం పెబ్బేర్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ చేతులు మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో సంఘం నియమించినందుకు రాష్ట్ర నాయకులు, తోటి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం



రుణమాఫీలో అనుమానాలు నివృతి చేస్తున్న ఏఈఓ అనిత

మదనాపురం: మండలంలో 18 నుంచి 59 ఏళ్లలోపు రైతులు ఆగస్టు 4వ తేదీలోగా రైతుబీమా దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ అనిత కోరారు. రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో అధికారులకు అందజేయాలని కోరారు. రైతుబీమాలో తప్పుల సవరణ ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని, ఇది వరకు దరఖాస్తు చేసుకున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం కార్యాలయంలో రుణమాఫీపై అనుమానాలు ఉన్న రైతులు ఆధార్ కార్డు తీసుకొని రావడంతో పరిశీలించి వివరించారు. రుణమాఫీపై ఎలాంటి అనుమానాలు ఉన్నా వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం



నియామక పత్రాలు అందిస్తున్న నారాయణ

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం మహిళా మోర్చా జిల్లా కమిటీని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నట్లు అశ్విని రాధ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలిగా అర్చన, జిల్లా కార్యదర్శులుగా సూగురు లక్ష్మి, కవితయాదవ్, అరుణ, నారాయణమ్మ, శ్రీదేవి, బండి పుష్ప, కార్యవర్గ సభ్యురాలిగా మహేశ్వరి, జిల్లా అధికార ప్రతినిధిగా జి.సరోజయాదవ్, వివిధ వర్గాల అధ్యక్షురాలుగా, సభ్యురాలు జ్యోతి, మంగమ్మ, విమల, సత్యమ్మ, పావని, సుశీల జ్యోతిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణ, పట్టణ అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షులు సీతారాములు, సుమిత్రమ్మ, మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ, పెద్దిరాజు, రాయన్న, రాములు, శ్రీను, లక్ష్మి, కవిత, అరుణ, విమల, పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.